కథా నిలయం
961

ఆలోచిస్తున్నాడు వర్తకుడు.

ఓడలో గందరగోళమూ కేకలూ వినబడ్డాయి ఇద్దరూ బైటికి వచ్చారు.

'మనిషి నీళ్లలో పడిపోయింది. రెండుసార్లు తేలి మునిగిపోయింది, చచ్చిపోయిందన్నమాటే' అన్నారు ఓడవాళ్లు.

'ఎవరు? ఎవరు?' అన్నాడు ఇంకిల్ ఆత్రంతో.

'మీతో వచ్చిన ఆ రెడ్ ఇండియన్.'

'అరే, ఎంత చక్కని పిల్ల! పాపం! అని జాలిపడ్డాడు బానిస వ్యాపారస్థుడు.

'దేవుడా! నూటయాభై పౌనులు పోయినట్టే—' అని విచారించాడు ఇంకిల్.

(ఒక ఇంగ్లీషు కథను అనుసరించి)

# బహుమానం

ప్రపంచంలో మరే రాజుకీ లభ్యంకాని కీర్తి సంపాదించాడు ఆ రాజు. అది శాశ్వతమైన కీర్తి. ఎన్నో దేశాలనుంచి, ఎంతోమంది యాత్రికులు వస్తారు. ఆ దేవాలయాన్ని చూస్తారు. ఆ గోపురాలను చూస్తారు. అబ్బా! అని విస్తుపోతారు. మళ్ళీ తమ దేశాలకపోతూ, ఆ రాజు కీర్తిని తమ దేశాలకు మోసుకుపోతారు.

అసలు ఆ ఆలయాన్నీ, అ గోపురాలనూ మొట్టమొదటిసారి తెరలు విప్పినప్పుడు చూడడానికి ఎన్నో దేశాలనుంచి వేలకొలదిగావచ్చారు ప్రేక్షకులు ఆ శిల్పి అలాంటివాడు. అతనికీర్తి అంతకుముందే ఎన్నోదేశాలలో వ్యాపించింది. అతడు నిర్మించిన గోపురాలు చూడటానికి, ఎంతోమంది సమర్థులైన శిల్పులే యాత్రలు చేస్తూవుంటారు.

ఇదివరకు తాను నిర్మించిన దేవాలయాలన్నిటికన్న అత్యంత సుందరంగా, ఆలయాన్నీ, ఇదివరకటి గోపురాలకన్న అత్యంత మనోహరంగా గోపురాలనూ నిర్మించడానికీ ఆ రాజుదగ్గర ఆ శిల్పి శపథం చేశాడు.

ప్రపంచంలో మరేరాజుకీ లేనికీర్తి, శాశ్వతమైన ప్రతిష్ఠ పొందాలనే కాంక్షతప్ప పరొక కోర్కె లేదు ఆ రాజుకి. తాను కట్టించిన యీ ఆలయంకంటె, యీ గోపురాలకంటె ఉత్తమమైనవి ఇక ప్రపంచంలో వుండకూడదు. అప్పుడే తన ఆధిక్యత.

ఆ శిల్పికూడా తనమాటనిలుపుకున్నాడు. రాజు కోర్కెను నెరవేర్చాడు. ఆ ఆలయాన్నీ, గోపురాలనూ, నిర్మాణం పూర్తికాగానే, మొట్టమొదటి సారి తెరలు విప్పినప్పుడు, చూసి రాజు ముగ్ధుడైపోయాడు. వాటిని విడిచి అంతఃపురంలోకి వెళ్ళలేకపోయాడు.

ఒకొక్క మూలనే కూర్చుని, పనిచేయిస్తూ నిర్మాణం పూర్తిచేసిన ఆ శిల్పికే, ఒక్కసారిగా తెరవిప్పి తన నిర్మాణాన్ని చూసేటప్పటికి, ఆనంద బాష్పాలు రాలాయి.

రాజు కోర్కె నెరవేరింది. శిల్పిపని పూర్తిఅయింది. ఇక శిల్పిశ్రమ ఫలించాలి. రాజు ఋణవిముక్తుడు కావాలి.

రాజు శిల్పికి ఏం బహుమానం ఇస్తాడు. ఏంచేసి, శిల్పిని తృప్తిపరుస్తాడు. శిల్పిమాట ఎలావున్నా, ప్రజలందరూ మెచ్చుకోవాలి గదా !

రాజు ఆలోచనలో పడ్డాడు. ఏ మాలోచించాడో, ఎలా ఆలోచించాడో.

ఆరాజు బహిరంగంగా ఒక పెద్ద దర్బారుచేశాడు.

సామంతులు, సేనానులు, పండితులు, కవులు, శిల్పులు - వేలకొలదిగా పౌరులు దర్బారులో క్రిక్కిరిసి పోయారు.

రాజుసింహాసనం, ప్రక్కనే మరొకరత్నఖచితమైనఆసనం, దానిలోశిల్పి.

రాజు, శిల్పికి తన కృతజ్ఞతను తెలియజేశాడు. శిల్పి నిర్మాణానికి తన జోహారు లర్పించాడు.

"శిల్పదేవా! నీవేదికోరినా సరే యివ్వడానికి సిద్ధుణ్ణి. నీకోర్కె తెలియజెయ్యి" అని రాజు అర్థించాడు. దర్బారు నిశ్శబ్దంగావుంది. శిల్పి దర్బారు వైపు చూశాడు.

"మహారాజా! నాశక్తినీ, ప్రతిభనూ నీ సేవలో వినియోగించాను. నాకొకటే కోరిక. రాజకుమారిని పరిణయం చేసుకోవాలి."

దర్బారులోని సభికులంతా చేతనంలేని బొమ్మలయారు.

రాజు ఏమి చెపుతాడు!

రాజు చిరునవ్వునవ్వాడు.

"నీకోర్కె ఫలిస్తుంది. నారాజ్య ప్రజలందరి సమక్షంలోనూ, నీకు నా కుమార్తెనిచ్చి పరిణయం చెయ్యడానికి సంతోషంగా వొప్పుకుంటున్నాను. సిద్ధాంతులు ముహూర్తం నిర్ణయిస్తారు.

కాని-నా తరువాత నీవేరాజు. అప్పుడు, నేను కట్టించిన యీ దేవాలయంకంటె, యీ గోపురాలకంటె గొప్పగా నీవు దేవాలయాలన్నీ, గోపురాలనూ నిర్మించుకుంటావనే భయం నాకు ఎక్కువగా వుంది. అలా జరగకూడదు. దానికి ఒకటే ఉపాయంతోచిందినాకు. రేపు ఉదయం, నా భటులు నీ రెండు కనుగ్రుడ్లనూ పీకివేస్తారు" అంటూ లేచి సిద్ధాంతులవైపు తిరిగి, "నా కుమార్తె వివాహానికి ముహూర్తం నిర్ణయించండి" అని దర్బారు చాలించాడు రాజు.

# సగంమంది

ఊరంతా అట్టుడికినట్టు వుడికిపోతోంది. ఎవరినోటచూసినా, ఆ పత్రికను గురించిన మాటలే. ఇంతకూ సంగతి ఏమిటంటే, ఆ పత్రికా సంపాదకుడు, ఆ వారపు సంపాదకీయంలో "ఈ వూరి మ్యునిసిపల్ కౌన్సిలు సభ్యులలో సగంమంది శుంఠలు" అని వ్రాశాడు. దానితో మ్యునిసిపల్ కౌన్సిలు సభ్యులకే కాక, వూరందరికీకూడా ఆ సంపాదకుడిమీద పట్టరానంత కోపం వచ్చింది.

సంపాదకుడు ఆ వూరివాడు కాడు. అది, అతని అత్తవారి వూరు. స్వగ్రామంలో చెలామణి కాలేక, అత్తవారి వూరికివచ్చి ఒక వారపత్రిక